సాక్షి
ప్రకాశం
మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024



ముఖాముఖిలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వేదికపై బాలినేని, చెవిరెడ్డి, టీజేఆర్, బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

రంజాన్ వేళలు
మంగళవారం - ఇఫ్తార్ : సా॥ 6.29
బుధవారం - సహరీ : ఉ॥ 4.37



'మేమంతా సిద్ధం' అంటూ ప్రకాశం విజయ గర్జన చేసింది. సార్వత్రిక ఎన్నికల ముంగిట్లో బస్సు యాత్ర వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. 46 డిగ్రీల గ్రీష్మతాపం ఒక వైపు.. సకలజనుల ఆరాధ్యుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జైత్రయాత్ర మరో వైపు.. యాత్రకు దండులా తరలివచ్చిన జనాభిమానం ముందు భానుడు సైతం చిన్నబోయాడు. గ్రామ గ్రామాన జనసందోహం.. అడుగడుగునా నీరాజనంతో మేమంతా సిద్ధం బస్సుయాత్ర దిగ్విజయమైంది. అవ్వాతాతలు.. దివ్యాంగులను.. చిన్నారులను ఆప్యాయంగా పలకరించి.. వారి కష్టాలను ఆలకించి 'నేను ఉన్నానంటూ' భరోసా ఇచ్చారు. కొనకనమిట్ల సమీపంలో నిర్వహించిన సభ దిగ్విజయం కావడంతో పార్టీ కేడర్ సమరోత్సాహంతో ఉంది.

కురిచేడులో సీఎం జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఓ భాగం



- జిల్లాలో మూడు రోజుల పాటు జగన్ జైత్రయాత్ర
- యుద్ధానికి మేము సిద్ధం అంటూ నినదించిన జనం
- అభిమాన నేతకు అడుగడుగునా బ్రహ్మరథం
- కొండపి, కనిగిరి, మార్కాపురం, దర్శిల్లో మేమంతా సిద్ధం బస్సు యాత్ర
- కొనకనమిట్ల జంక్షన్‌లో బహిరంగ సభ, దర్శిలో పెన్షన్‌దారులతో ముఖాముఖి
- మేమంతా సిద్ధం బస్సు యాత్ర 10వ రోజుకు 1,000 కిలో మీటర్లు



విజయగర్జన

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: బిందువు..బిందువు సింధువైనట్టు జిల్లాలో వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు జనం పోటెత్తారు. అడుగడుగునా నీరాజనం పలికారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ముగించుకొని 9వ రోజు శనివారం రాత్రి 7 గంటల సమయంలో సింగరాయకొండ మండలంలోని మన్నేరు బ్రిడ్జి దాటి జిల్లాలోకి ప్రవేశించింది. అక్కడ నుంచి ప్రారంభమైన యాత్ర దిగ్విజయంగా సాగింది. ఎక్కడ చూసినా ఇసుకేస్తే రాలనంత జన సమూహం.

46 డిగ్రీల భానుడి ప్రతాపాన్ని సైతం లెక్కచేయకుండా....

జిల్లాలో ఆదివారం, సోమవారం భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. ఏకంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉడుకెత్తించాడు. అయినా అభిమాన నేత సీఎం వైఎస్ జగన్ ఒక్కసారి కళ్లారా చూడాలి... ఆయనను దూరం నుంచి అయినా పలకరించాలి...దగ్గరగా వెళ్లి చేతిలో చేయి వేసి స్పర్శను ఆస్వాదించాలి అన్న కోరికలతో చిన్నారుల నుంచి పండుటాకుల వరకు గంటల తరబడి వేచి ఉన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను ప్రతి కుటుంబం వారి కుటుంబ సభ్యునిగా భావిస్తూ వస్తున్నారు. అందుకే ఆ ఆప్యాయత...ఆ ప్రేమానురాగాలు కురిపించటం వల్లనే మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఒక ప్రభంజనంలా సాగింది. ఎర్రని ఎండలో సైతం వృద్ధులు కూడా సడలని ప్రేమానురాగాలతో వేచి ఉండి మరీ వైఎస్ జగన్‌ను ఒక సారి చూసి నువ్వు చల్లగా ఉండాలని దూరంగా నుండైనా సరే దీవించి సంతోషంగా ఇళ్లకు వెళ్తున్నారు.

జువ్విగుంట జంక్షన్‌లో బస....

సీఎం వైఎస్ జగన్ 9వ రోజు మేమంతా సిద్ధం బస్సు యాత్ర జిల్లాలో మొదటి రోజు శనివారం కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు మండలం జువ్విగుంట జంక్షన్‌లో రాత్రి బస చేశారు. కొండపి నియోజకవర్గంలోని సింగరాయకొండ మండలంలో గుండా కందుకూరు నియోజకవర్గంలోకి ప్రవేశించారు. అక్కడ నుంచి తిరిగి కొండపి మండలంలోని పొన్నలూరు మండలం జువ్విగుంట జంక్షన్‌లో బసచేశారు. చీకటి పడ్డా కొండపి, కందుకూరు నియోజకవర్గాల ప్రజలు వాళ్ల అభిమాన నేతను చూసేందుకు వేయి కళ్లతో ఎదురుచూస్తూనే ఉన్నారు. జువ్విగుంట బస ప్రాంగణానికి చేరుకోవటానికి దాదాపు మూడు గంటలు ఆలస్యంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

నాలుగు నియోజకవర్గాల్లో జైత్రయాత్ర

ఆదివారం ఉదయం జువ్విగుంట బస ప్రాంగణం నుంచి మేమంతా సిద్ధం బస్సు యాత్ర ప్రారంభమైంది. సోమవారం మధ్యాహ్నం వరకూ కొండపి, కనిగిరి, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లో జగన్ జైత్రయాత్ర సాగింది. జువ్విగుంట నుంచి యాత్ర ప్రారంభమైంది. కే అగ్రహారం వద్ద వేలాదిగా జనం తరలివచ్చి జగన్‌కు జేజేలు పలికారు. అక్కడ నుంచి యాత్ర కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలంలోకి ప్రవేశించింది. కనిగిరి పట్టణం జనసంద్రంగా మారింది. మహిళలు దిష్టితీశారు..మండుటెండల్ని సైతం లెక్కచేయకుండా తనకోసం తరలివచ్చిన వారికి అభివాదం చేయడంతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులతో ముచ్చటించారు. వారి కష్టాలు తెలుసుకున్నారు. పట్టణంలోని పామూరు బస్టాండ్ సెంటర్ అభిమానులతో కిక్కిరిసిపోయింది. అక్కడ నుంచి జన నీరాజనాలతో కనిగిరి పట్టణంలో గుండా చినారికట్ల జంక్షన్ మీదుగా మార్కాపురం నియోజకవర్గం కొనకనమిట్ల జంక్షన్‌కు మేమంతా సిద్ధం బస్సు యాత్ర సాగింది. అక్కడ ఆదివారం బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ చంద్రబాబు నీచ రాజకీయాలపై నిప్పులు చెరిగారు. జిల్లా నలుమూల నుంచి తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలతో సభప్రాంగణం జనకెరటాలను తలపించింది. సీఎం మాట్లాడుతున్నంత సేపూ జనం నుంచి పెద్ద ఎత్తున మద్దతు వచ్చింది. అక్కడ నుంచి మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి మీదుగా సాయంత్రానికి దర్శి నియోజకవర్గంలోని వెంకటాచలంపల్లి క్యాంపునకు మేమంతా సిద్ధం బస్సు యాత్ర చేరుకుంది.


వెంకటాచలంపల్లి వద్ద అభిమానులతో కరచాలనం

దర్శి పట్టణం దాటడానికి 3 గంటల సమయం:

పొదిలి నుంచి దర్శి పట్టణానికి వెళ్లే మార్గం మధ్యలో అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. తమను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌ను ఎన్ని అవాంతరాలు ఎదురైనా కళ్లారా చూడాలన్న లక్ష్యంతో అవ్వా తాతలు, చిన్నారులు సైతం గంటల కొద్దీ వేచి ఉన్నారు. మనవడా అని పిలిచే పండుటాకులు...మామయ్యా అని కేకలు వేసే పసి కూనలు....అయ్యా అంటూ మరికొందరు...ఇలా అందరి ఆదరాభిమానాలు పొందుతూ మేమంతా సిద్ధం బస్సు యాత్ర కోలాహలంగా సాగింది. దర్శి పట్టణానికి చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌కు దర్శి దాటి వెంకటాచలంపల్లి క్యాంపునకు చేరుకోవటానికి దాదాపు మూడు గంటలకు పైగా పట్టిందంటే దర్శిలో ప్రజల ఆప్యాయత, అనురాగాలు వైఎస్ జగన్‌పై ఏ మేరకు ఉన్నాయో అర్థమవుతోంది. ఆదివారం రాత్రికి వెంకటాచలం పల్లిలో బస చేశారు సీఎం వైఎస్ జగన్.

10వ రోజుకు వెయ్యి కిలో మీటర్ల మార్క్:

సీఎం వైఎస్ జగన్ మేమంతా సిద్ధం బస్సు ప్రారంభించిన 10వ రోజుకు 1000 కిలో మీటర్ల మార్కుకు చేరుకున్నారు. సీఎం వైఎస్ జగన్ ఏ యాత్ర చేసిన ఒక చరిత్రే. దేశంలో ఏ నాయకుడు చేయనంతగా ప్రజా సంకల్ప పాదయాత్ర 3,654 కిలో మీటర్లు నడిచి చరిత్ర సృష్టించారు. అంతకు ముందు ఓదార్పు యాత్ర చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొత్తం చుట్టి వచ్చారు. అధికారంలో ఉండి మరీ ఎమ్మెల్యేలను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పేరుతో ఇంటింటికీ తిప్పి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విపులీకరించేలా ప్రజా ప్రతినిధులను పరుగులు పెట్టించారు. ఏది చేసినా ప్రజలకు మనం జవాబుదారులం అన్న సందేశాన్ని ప్రజల్లోకి వెళ్లేలా కార్యాచరణ చేపట్టారు.


కురిచేడులో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

ఆకట్టుకున్న పెన్షన్‌దారులతో ముఖాముఖి


ముఖాముఖికి హాజరైన పెన్షన్‌దారులు

వెంకటాచలంపల్లి క్యాంపులో సోమవారం నిర్వహించిన 11వ రోజు మేమంతా సిద్ధం బస్సు యాత్ర పెన్షన్‌దారులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. అవ్వా, తాతలు వాళ్ల అనుభవాలను నేరుగా తన మనవడికి విన్నవించుకున్నారు. 55 సంవత్సరాల ప్రభావతి అయితే నాకు కన్న బిడ్డ కూడా పెట్టడం లేదయ్యా...నువ్వే నాకు బిడ్డవి... మీరే పెడుతున్నారయ్యా అంటూ కన్నీరు మున్నీరై తన ఆప్యాయతను వెల్లడించింది. 58 నెలల పాటు ఇంటి వద్దకే పింఛను తెచ్చి వలంటీర్ మనుమడు తెచ్చి ఇచ్చాడయ్యా. ఈ నెలలోనే పింఛను కోసం నానా అవస్థలు పడ్డానయ్యా అంటూ తన గోడు వెళ్లబోసుకుంది. పింఛనుదారులు ముక్త కంఠంతో మళ్లీ నువ్వే రావాలి సీఎంగా అంటూ నినాదాలు చేశారు. అవ్వా, తాతల ఉసురు చంద్రబాబు పోసుకుంటారంటూ శాపనార్థాలు పెట్టారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో బస్సు యాత్ర జిల్లా సరిహద్దు అయిన కురిచేడు మండలం వెంగాయపాలెం చేరుకుంది. అక్కడి నుంచి పల్నాడు జిల్లా వినుకొండకు పయనమై వెళ్లింది. రెండు రోజుల బస్సు యాత్రలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, టీజేఆర్ సుధాకర్‌బాబు, ఎమ్మెల్యే అభ్యర్థులు తాటిపర్తి చంద్రశేఖర్, దద్దాల నారాయణ యాదవ్, డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద రెడ్డి, ఆయన తల్లి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి సీఎం జగన్ వెంటే ఉన్నారు.


మా నమ్మకం నువ్వే జగన్ అంటూ బ్రోచర్లు చూపుతున్న వృద్ధులు



కురిచేడులో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జన నీరాజనం

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు దర్శి నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సోమవారం కురిచేడు మండలం వెంకటాచలంపల్లి నుంచి ప్రారంభమైన యాత్ర వినుకొండ చేరుకుంది. మార్గమధ్యంలో అభిమానులు పూలు చల్లుతూ, దిష్టి తీస్తూ సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. సమస్యలు చెప్పుకొన్న దివ్యాంగులు, వృద్ధులకు తానున్నానంటూ జగన్ భరోసా ఇచ్చారు.





బంగారుకొండవయ్యా మా జగన్ మామయ్య.. సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో చిన్నారులు







కురిచేడు మార్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అభిమానుల బ్రహ్మరథం

నేను విన్నాను.. నేను ఉన్నాను



వృద్ధుల సమస్యలు ఆలకిస్తున్న సీఎం వైఎస్ జగన్



దివ్యాంగుడికి భరోసా..



కష్టం చెప్పుకొన్న ఓ సోదరికి ఓదార్పు



మహిళ సమస్య శ్రద్ధగా వింటూ..



అమ్మా.. నీకు నేనున్నా..



అవ్వకు ధైర్యం చెబుతూ..







దివ్యాంగుల సమస్యలు విని అండగా ఉంటానని భరోసా ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్సార్ సీపీలో మైనార్టీ, కాపు నేతల చేరిక



సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ఉస్మాన్



శ్రావణి వెంకటేశ్వర్లు

- సాదరంగా ఆహ్వానించిన సీఎం వైఎస్ జగన్

మార్కాపురం/పొదిలి: మార్కాపురం నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీ, కాపు సామాజికవర్గాలకు చెందిన ఇద్దరు నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం సాయంత్రం పొదిలి సమీపంలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' ఎన్నికల ప్రచార సభ ప్రాంగణం వద్ద మార్కాపురానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడు, దివంగత టీడీపీ నేత లాల్‌జాన్‌బాషా ముఖ్య అనుచరుడు షేక్ ఉస్మాన్, పొదిలికి చెందిన కాపు సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, శ్రీకృష్ణ దేవరాయల కళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెలిశెట్టి వెంకటేశ్వర్లు(శ్రావణి)కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నా రాంబాబు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని ఇరువురు నేతలకు సీఎం సూచించారు.

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

ఒంగోలు: ప్రజలకు క్రోధి నామ సంవత్సర (ఉగాది) శుభాకాంక్షలను పలువురు ప్రముఖులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి, రీజినల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాష్ట్ర మంత్రులు మేరుగు నాగార్జున, డాక్టర్ ఆదిమూలపు సురేష్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు, టీటీడీ పాలకమండలి సభ్యుడు శిద్దా సుధీర్‌బాబు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం ప్రజలకు సుఖ సంతోషాలను, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్ ప్రక్రియపై శిక్షణ

ఒంగోలు అర్బన్: పోలింగ్ ప్రక్రియపై ఎన్నికల అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, ఈవీఎం నోడల్ ఆఫీసర్లు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లకు కలెక్టరేట్ స్పందన హాల్లో వర్క్‌షాప్ నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలిచ్చారు. మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి అధికారులు, రాజకీయ పార్టీల ఏజెంట్లకు సీటింగ్, ఈవీఎంల అనుసంధానంపై డెమో ఇచ్చారు. వృద్ధులకు హోమ్ ఓటింగ్ ప్రక్రియలో ఎదురైన సమస్యలను ఎలా అధిగమించాలో కలెక్టర్ సూచనలిచ్చారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్‌ఓ శ్రీలత, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, నియోజకవర్గాల ఆర్‌ఓలు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకే ముందస్తు చర్యలు

పొదిలి: విద్యుత్ ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకున్నామని ఆ శాఖ ఎస్‌ఈ సత్యనారాయణ, ఏఈ అంకబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు జరిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు తెలిపారు. సీఎం బస్సు యాత్ర సందర్భంగా పోలీసులు, సీఎం సెక్యూరిటీ సిబ్బంది కరెంట్ తీగలు 27 అడుగుల ఎత్తున ఉండాలని సూచించటంతో ఆ మేరకు చర్యలు తీసుకుని, మీడియా ద్వారా ప్రజలకు సమాచారం అందించామని చెప్పారు. అయితే విద్యుత్ కోతలు విధిస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న ప్రచారం వాస్తవం కాదని స్పష్టం చేశారు. సీఎంను చూడాలనే ఉద్దేశంతో పలువురు ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ పోల్స్ కూడా ఎక్కారని, ఎక్కడా ప్రాణ నష్టం సంభవించకూడదన్న ఉద్దేశంతో విద్యుత్ సరఫరా అనివార్యంగా కొంత సమయం ఆయా ప్రాంతాల్లో నిలిపివేశామని వివరించారు. వైద్యశాలల్లో రోగులకు ఇబ్బంది లేకుండా ఆస్పత్రి అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారని తెలిపారు.

70 మంది పీఓ, ఏపీఓలకు షోకాజ్ నోటీసులు

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రిసైడింగ్, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. రెండో విడతలో 70 మంది అధికారులు నియామక ఉత్తర్వులు అందుకుని శిక్షణకు గైర్హాజరు కావడంతో వారందరికీ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ సోమవారం రాత్రి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎక్కువమంది మెడికల్ లీవులు సాకుగా చూపి శిక్షణకు హాజరుకాలేదని, వారందరికీ మెడికల్ బోర్డు ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో సెలవు తీసుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.